
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 20 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	218	248
సూర్యాపేట	రూ.125	220	250
నల్లగొండ	రూ.158	230	264

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.5 । కనిష్ఠం 25.2



బత్తాయి సాగుకు గడ్డుకాలం

ఎవుసం దండగైంది.. ఆరుగాలం చెమటోడ్చి పంట పండించినా రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. మార్కెట్లలో దళారుల రాజ్యమైంది. ధర విషయంలో వారు చెప్పిందే వేదం... కాదంటే రైతన్నకు ప్రత్యామ్నాయమే కరువు. సర్కారు పట్టించుకోకపోవడంతో బత్తాయి రైతుల వ్యథ ఇదో అంతులేని కథగా మారింది. దశాబ్దాలుగా బత్తాయి కొనుగోలులో దళారుల ప్రమేయం అధికమైంది.

- మిర్యాలగూడ (వ్యవసాయం)

- పండించినా విక్రయించుకోలేని పరిస్థితి
- దశాబ్దాలుగా దళారులదే హవా
- నష్టపోతున్న రైతులు

నల్లగొండ ఎర్ర ఇసుక నేలలకు నెలవు. బత్తాయి పంటలకు చాలా అనువైన ప్రాంతం. నీటి వనరుల లభ్యత తక్కువగా ఉండటంతో అందుకు అనువైన బత్తాయి సాగును రైతులు చేపట్టారు. నాలుగు దశాబ్దాలుగా 1990 నుంచే పంట ప్రారంభమై 2000నాటికి సుమారు 2లక్షల ఎకరాలకు చేరుకొని బత్తాయి సాగులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నల్లగొండ మొదటి స్థానంలో నిలిచింది. ఆ సమయంలో రైతులు మంచి దిగుబడులు కూడా సాధించారు. అయినా రైతులు పెద్దగా ప్రయోజనం పొందలేక పోయారు. కాలక్రమేణా వాతావరణంలో మార్పులతో తోటలు దెబ్బతిని దిగుబడులు తగ్గాయి. పెట్టుబడులు భారీగా పెరిగాయి. కాయకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పూర్తిగా దళారులదే రాజ్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులు నష్టాలపాలయ్యారు. 2010 నుంచి బత్తాయి సాగు తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం 40వేల ఎకరాలకు మాత్రమే బత్తాయి పరిమితమైంది.

వారు చెప్పిన ధరకే

బత్తాయిని తోటల వద్ద బేరం కుదుర్చుకునేందుకు ఆంధ్ర రాష్ట్రంలో కర్నూలు ప్రాంతానికి చెందిన వ్యాపారులు నల్లగొండ ప్రాంతానికి సీజన్ వారీగా వస్తుంటారు. రైతులను మచ్చిక చేసుకుని వారు వ్యాపారాలు చేస్తుంటారు. ఇక్కడ వ్యాపారులు సిండికేట్‌గా మారి డిమాండ్‌ను అనుసరించి ధర నిర్ణయిస్తుంటారు. తోటల వద్దకు ఏ వ్యాపారి వచ్చినా వారు నిర్ణయించుకున్న ధరకు మించి పెట్టరు. అంతా పకడ్బందీగా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. వేసవిలో వచ్చే కత్తెర కాయ దిగుబడులు చాలా తక్కువగా ఉంటాయి. డిమాండ్ అధికంగా ఉంటుంది. ఆ సమయంలో మార్కెట్ కంటే కనీసం టన్నుకు రూ.20వేల వరకు తక్కువగా రైతుకు వ్యాపారులు చెల్లిస్తున్నారు. జూన్ నుంచి సీజన్ కాయకు టన్నుకు రూ.20వేలకు మించి ఎప్పుడూ వ్యాపారులు ధరపెట్టరు. పైగా టన్నుకు క్వింటా కోత విధిస్తారు. 20 టన్నుల బత్తాయికి రెండు టన్నులు సూట్ కింద పోతుంది. అన్నీపోగా రైతులకు పెట్టుబడి మిగిలే పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ మద్దతు కరువు

నాలుగు దశాబ్దాలుగా బత్తాయి సాగు జరుగుతున్నా మార్కెట్‌లో దోపిడీని అరికట్టడం, వ్యాపారులను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతులు పేర్కొంటున్నా రు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నా, ప్రభుత్వాలు స్పందించడం లేదు. రైతుల గోస ఆలకించే వారే లేరు. బత్తాయికి కనీస ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



బత్తాయికి గడ్డుకాలం

బత్తాయి విక్రయాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నాం. స్థానికంగా మార్కెట్లు లేకపోవడం, హైదరాబాద్‌కు తీసుకు వెళ్లినా వ్యాపారుల దోపిడీకి గురవుతున్నాం. కనీస ధర చెల్లించకపోవడంతో పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది. దళారులకు కాయలు విక్రయిస్తే గిట్టుబాటు కావడం లేదు. మోసాలకు గురవుతున్నాం. మార్కెట్లో బత్తాయికి కనీస ధర చెల్లించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- నవీన్‌రెడ్డి, రైతు, కుక్కడం, మాడ్గులపల్లి మండలం

మార్కెట్‌లో దోపిడీ



బత్తాయిని విక్రయించాలంటే హైదరాబాద్ గడ్డిఅన్నారం మార్కెట్‌కు తీసుకెళ్లాలి. ప్రారంభంలో రైతులు మార్కెట్‌కు వెళ్లినా ధర పలికేది కాదు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ప్రారంభించారు. కొన్ని కాయలకు కనీస ధర ఇచ్చి మిగతా కాయలను నామమాత్రపు ధరకు కొనుగోలు చేసేవారు. వందకు కమీషన్ రూ.4తోపాటు కూలీలు, గుమస్తా, రవాణా ఇతర ఖర్చులు వందకు రూ.10 పైగా ఖర్చు వచ్చేది. ధర లేనప్పుడు చేతి ఖర్చులు కూడా వచ్చేవి కావు. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో టన్ను బత్తాయికి రూ.50వేల వరకు ఉండగా, రైతుకు దక్కేది మాత్రం రూ.30వేల నుంచి రూ.40వేలు మాత్రమే. దీంతో దోపిడీ తట్టుకోలేక రైతులు మార్కెట్ వెళ్లడానికి జంకుతున్నారు. నల్లగొండలో బత్తాయి సాగు అనుసరించి 2018లో మార్కెట్ ఏర్పాటు చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో రైతులకు ఇక్కడా మద్దతు దక్కలేదు. దీంతో ఈ మార్కెట్ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఏడాదికే మార్కెట్ మూతపడింది.

కొనుగోలు, చెల్లింపుల్లో మోసాలు

బత్తాయి వ్యాపారులు ఏళ్ల తరబడి ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేస్తుండటంతో రైతులను మచ్చిక చేసుకున్నారు. కొన్ని కాయలు టన్నుల లెక్కన కొనుగోలుచేసి గుత్తా కింద మాట్లాడుకొని ఒప్పందం చేసుకుంటారు. ఈ వ్యాపారులు బత్తాయిని ఉత్తర భారత దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. వ్యాపారులు మార్కెట్ బాగా ఉన్నపుడు పోటీ పడి కొనుగోలు చేస్తారు. తోటల్లో కొంత కాయలు కోశాక, తరువాత మార్కెట్‌లో ధర పడిపోయిందంటారు. బాగా నష్టం వచ్చిందని కోతలు నిలిపివేస్తారు. ధర గురించి మాట్లాడాలని, లేదంటే కాయలు తమకొద్దని రైతులకు చెబుతారు. అప్పటి నుంచి పంచాయితీలు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం సర్వసాధారణంగా మారతాయి. చివరికి ధర తగ్గించి వ్యాపారి చెప్పిన ధరకే రైతులు ఒప్పుకోవాల్సిన దుస్థితి. తోటకు ఒక వ్యాపారి బేరం కుదుర్చుకుంటే ఏ వివాదం ఏర్పడినా, మరో వ్యాపారి ఆ తోట వద్దకు రారు. దీంతో రైతులు భారీగా నష్టపోవాల్సివస్తోంది. కాయ బేరం అయినప్పుడు కొంత మేరకు మాత్రమే అడ్వాన్స్‌గా చెల్లిస్తారు. కాయలు తెంపిన తరువాత లారీ కాంటా వేసి నగదు చెల్లిస్తుంటారు. కొంత మంది రైతులతో ఉన్న సంబంధాలను ఆసరా చేసుకుని తరువాత చెల్లిస్తామని పరారయిన ఘటనలు దశాబ్దాల నుంచి వందల్లో ఉన్నాయి. కొంత మంది వ్యాపారులు కోట్లల్లో ఎగనామం పెట్టిన సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. చాలా మంది రైతులు ఇప్పటివరకు లక్షల్లో నష్టపోయారు. రైతులు వ్యాపారులను వెతుకుతూ వెళ్లి వారి స్వగ్రామాల్లో పట్టుకున్నా, అక్కడ ఏమీచేయలేక పోవడంతో వారి నుంచి రూపాయ కూడా వెనక్కి తీసుకోలేకపోయారు. కొంత మంది ఐపీ పెట్టడంతో రైతులు లబోదిబోమంటూ ఇంటి దారి పట్టారు. ప్రతీ బత్తాయి రైతుకు ఇలాంటి అనుభవాలు ఉన్నాయి. సాగులో ఎన్ని కష్టాలు ఉన్నా భరిస్తున్నామని, కాయ విక్రయాల్లో మోసపోతున్నామంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.



పంటల ప్రణాళిక సిద్ధం

- 11లక్షల పైగా ఎకరాల్లో సాగు అంచనా
- వరి, పత్తి పంటలకే పెద్దపీట
- మే 3వ వారంలో వేసవి దుక్కుల్లో పత్తి వేసే అవకాశం

నల్లగొండ, ఏప్రిల్ 19: ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్‌కు సంబంధించి వ్యవసాయశాఖ పంటల ప్రణాళికను రూపొందించింది. జిల్లాలో మొత్తం 11లక్షల ఎకరాలకు పైగా వరి, పత్తితో పాటు వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలకరి వర్షాలకు ముందే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణశాఖ పేర్కొనడంతో అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. జిల్లా పరిస్థితులకు అనుగుణంగా ఈ సారి కూడా వరి, పత్తి సాగుకే వ్యవసాయశాఖ పెద్ద పీట వేసింది. సాధారణం కంటే అధిక వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ పేర్కొనడంతో అందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువులను ఆయా మండలాలకు చేరవేసేలా ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది అంతగా వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి యాసంగి వరి సాగుపై తీవ్ర ప్రభా వం చూపించింది. బోర్లు ఎండిపోవడంతో పాటు సాగునీరు అందక దిగుబడిపై ప్రభావం పడింది.

11లక్షలకు పైగా ఎకరాల్లో

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో మొత్తం 11లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. వరి 5,19,160ఎకరాల్లో సాగు కానుండగా, 1,04,294 క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులో ఉంచనున్నారు. అదేవిధంగా పత్తి 5.4 లక్షల ఎకరాల్లో సాగు కానుండగా, 15లక్షల విత్తనాల ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని ప్రణాళిక రూపొందించారు. కందులు 4,710ఎకరాల్లో సాగు చేయనుండగా, 1,413క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచనున్నారు. పెసర్లు 1,468 ఎకరాల్లో సాగు కానుండగా, 1,017క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. మినుములు 946ఎకరాల్లో సాగు కానుండగా, 756 క్వింటాళ్ల విత్తనాలు, జొన్నలు 185ఎకరాల్లో సాగుకానుండగా, 74క్వింటాళ్ల విత్తనాలు, సజ్జలు సాగు అంచనా 35ఎకరాలు కాగా, 7క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచనున్నారు. వేరుశనగ 1,145ఎకరాల్లో సాగు కానుండగా, 6.87క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేయనున్నారు. పచ్చిరొట్టకు సంబంధించి జీలుగ 56,030ఎకరాల్లో సాగు కానుండగా,6,723క్వింటాళ్ల విత్తనాలు, జనుము 15,440ఎకరాల్లో వేయనుండగా 2,448క్వింటాళ్ల విత్తనాలు, పిల్లిపెసర 8,835 ఎకరాల్లో సాగుకానుండగా,365క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ నిర్ణయం తీసుకుంది.

వానాకాలం సీజన్‌కు సన్నద్ధంగా ఉన్నాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. 11లక్షలకు పైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశాలు ఉన్నాయి. అందుకు సంబంధించి వరి, పత్తి విత్తనాలతో పాటు పప్పు దినుసులు, ఇతర విత్తనాలన్నింటినీ ముందుగానే సిద్ధం చేసి ఉంచుతాం. అదేవిధంగా ఎరువులు కూడా అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేస్తున్నాం. వర్షాలు ప్రారంభానికి ముందే యాక్షన్ ప్లాన్ ప్రకారం విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

- టి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

మే మూడో వారంలో పత్తి విత్తనాలు

ఈ ఏడాది మే మూడో వారంలో రైతులు వేసవి దుక్కుల్లో పత్తి విత్తనాలు వేసే అవకాశం ఉంది. మే నెలాఖరున అడపాదడపా ముందస్తుగా వర్షాలు, లేదంటే జూన్ మొదటి వారంలో మృగశిర కార్తె నాటికి తొలకరి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. దీంతో వేసవి దుక్కుల్లో ముందుగానే పత్తి విత్తనాలు పెడితే పత్తి చేను ఏపుగా పెరగడంతో పాటు దిగుబడులు అధికంగా వస్తాయని రైతులు ముందస్తు విత్తనాలు వేస్తారు. ఈ నేపథ్యంలో పత్తి విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ భావిస్తోంది. ఈ సారి మంచి వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అంచనాలు వేస్తున్న విషయంలో రైతులు వానాకాలం సీజన్‌లో పత్తి సాగును ముందస్తుగా చేపట్టే అవకాశాలు ఉన్నాయి. యాసంగిలో తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి ఈ వానాకాలం సీజన్ కలిసి వస్తుందని వాతావరణశాఖ అంచనాల ప్రకారం రైతులు ఆశలు పెంచుకున్నారు.



బీఆర్ఎస్‌కు ఎక్కడా డిపాజిట్ దక్కదు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

•7లో..



ఆయకట్టును ఎడారిగా మార్చారు

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

•7లో..



బీజేపీ కలలను భగ్నం చేయాలి

కలహాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు

•7లో..

రెండో రోజు తొమ్మిది నామినేషన్లు

ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



యాదాద్రి కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు కే. జెండగేకు నామినేషన్ అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

యాదాద్రి/నల్లగొండటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లోకసభ ఎన్నికల నామినేషన్లలో భాగంగా రెండోరోజు శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంటు నియోజకవర్గాలకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ధర్మ సమాజ్ పార్టీ తరపున తలారి రాంబాబు, మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) పార్టీ తరపున వసుకుల మట్టయ్య, కిన్నెర యాదయ్య స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

భువనగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్, సోషలిస్టు పార్టీ(ఇండియా) అభ్యర్థి రచ్చ సుభద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా మెగావత్ చందునాయక్, రేకల సైదులు ఒక్కో సెట్ నామినేషను ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. సీపీఎం అభ్యర్థి జహంగీర్ నామినేషన్ పత్రాల దాఖలుకు సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరయ్యారు. మొదటి రోజు ఏడు నామినేషన్లు దాఖలు చేయగా, రెండో రోజు తొమ్మిదితో మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయి.

భువనగిరి అర్బన్: యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ వద్ద 144 సెక్షన్ అమలు చేస్తుండడంతో ప్రధానగేట్ వద్ద పోలీసులు గుర్తింపు కార్డులు, ఇతర వాహనాలను తనిఖీచేసి లోపలికి అనుమతించారు. కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదురుగా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగి 100 మీటర్ల నిబంధన అమలు కావడం లేదు. సీపీఎం అభ్యర్థి వెంట వచ్చిన కార్యకర్తలు స్వచ్ఛందంగా ఎవరికి వారే పులిహోర తెచ్చుకొని తిన్నారు.



యాదాద్రి కలెక్టర్‌కు నామినేషన్ అందజేస్తున్న సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్, చిత్రంలో రాఘవులు, జూలకంటి, సీతారాములు

నామినేషన్ కౌంటర్ 2వ రోజు

నియోజకవర్గం	19న దాఖలు	గతంలో దాఖలు	మొత్తం
నల్లగొండ	4	4	8
భువనగిరి	5	3	8
మొత్తం	9	7	16

ఫాం 12ను సకాలంలో అందజేయాలి

కలెక్టర్ దాసరి హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 19: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, అత్యవసర సేవలందించే శాఖల ఉద్యోగులందరికీ ఫాం 12సకాలంలో అందజేయాలని,అందిన వెంటనే సంబంధిత అధికారులు ధ్రువీకరణ ఇవ్వాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో పార్లమెంటరీ పోస్టల్ బ్యాలెట్ విషయమై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా శాఖల ద్వారా ఎంతమంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌కోసం ఫాం 12 జారీ చేసింది? ఎంతమంది తిరిగి ఇచ్చింది డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. ఏ ఉద్యోగి తనకు పోస్టల్ బ్యాలెట్ రాలేదని ఫిర్యాదు చేయకూడదని, ఒకవేళ అలాంటి ఫిర్యాదులు వస్తే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులు, డ్రైవర్లు, ఆఫీసు సబార్డినేట్లు సైతం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఎవరైనా శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కోసం ఫాం 12 తీసుకోపోతే, తక్షణమే తీసుకొని పూర్తి వివరాలతో నింపి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి సోమవారం నాటికి సమర్పించాలన్నారు. సోమవారం చివరి రోజు అని, 23 తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్ ఫాంలు స్వీకరించమని, ఇదే చివరి అవకాశమని పునరుద్ఘాటించారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం సద్వినియోగం చేసుకునే ఉద్యోగులు ఎన్నికల సంఘం ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ కేంద్రాలకు ప్రత్యక్షంగా వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ పంపడం కుదరదన్నారు.

శిక్షణకు హాజరుకాని వారికి షోకాజ్ నోటీసులు

ఎన్నికల విధుల శిక్షణ హాజరుకాని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఎన్నికల విధులనుంచి మినహాయింపు పొందని వారంతా ఈ నెల 23న సంబంధిత ఏఆర్‌వో స్థాయిలో నిర్వహించే శిక్షణా తరగతులకు హాజరుకావాలని, లేదంటే అలాంటి వారిని సస్పెండ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ఆయా అంశాల వారీగా తగు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకునికి స్వాగతం పలికిన కలెక్టర్

లోకసభ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ అధికారి కళ్యాణ్ కుమార్ దాస్‌కు కలెక్టర్ దాసరి హరి చందన పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్, డిప్యూటీ ఆర్వో నటరాజ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రవికుమార్, డీఆర్‌వో డి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

బీజేపీకి అండగా యువకులు, మహిళలు

బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

•7లో..

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

డీఆర్డీవో పీడీ నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ నాగిరెడ్డి

కేతేపల్లి, ఏప్రిల్ 19: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీ టి.నాగిరెడ్డి అధికారులకు సూచించారు. శాలిగౌరారం, కేతేపల్లి మండలాలకు చెందిన పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల్లో ప్రస్తుతం తాగునీటి ఇబ్బందులు, ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరు, ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో రైతులు, హమాలీలకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు ఉదయం పూట మాత్రమే నిర్వహించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాను నిత్యం పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. నీటి ఇబ్బందులు ఎదురయ్యే చోట తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, కేతేపల్లి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో నాగయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం యాదమ్మ, ఈజీఎస్ ఏపీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ 2024 షెడ్యూల్‌లో మార్పు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 19: పాలీసెట్ -2024 ప్రవేశపరీక్ష షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జానకిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మే 17 జరగాల్సిన ప్రవేశపరీక్షను మే 24వ తేదీ వాయిదావేసినట్లు తెలిపారు. పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులంతా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గిరిజన తండాల్లో ఎక్సైజ్ దాడులు

సంస్థాన్ నారాయణపురం ఏప్రిల్ 19: యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు నేతృత్వంలో మండలంలోని కొర్రతండా, డాకు తండ, సీత్యతండా, రాధానగర్‌తండ, అంగోతు తండ, పొర్లగడ్డ తండాల్లో శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా నిలువ ఉం చిన 68లీటర్ల మద్యం, 35కిలోల బెల్లం, 2200లీటర్ల వాష్‌ను ధ్వంసం చేశారు.

యాదగిరికొండపై ఏకాదశి పూజలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 19: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో శుక్రవారం ఏకాదశి పూజలు వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన పూజలు పాంచరాత్రాగమనరీతిలో ఆచార్యులు విశేషంగా జరిపారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వామిఅమ్మవారలను మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయం ముఖమండపంలో కవచమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు పొదిగిన బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సింహాసనంపై అధిష్ఠింపజేశారు. స్వామిఅమ్మవారలకు సహస్రనామార్చనలను పఠిస్తూ వివిధ పుష్పమాలికలతో లక్షపుష్పార్చన చేపట్టారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో కొలువుదీరిన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యార్చనలు, రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. అమ్మవారిని దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించి ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మంగళనీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవంలో పాల్గొన్న మహిళ భక్తులు దర్శించి తరించారు. కాగా, జిల్లాలో 43.8డిగ్రీల ఎండ తీవ్రతకు భక్తులు సాధారణంగా భక్తులు క్షేత్ర సందర్శనకు తరలివచ్చారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 15,79,807ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ప్రధానాలయానికి అనుబంధ శివాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామివారి వసంత నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిపారు. నిత్యారాధనల అనంతరం రుద్రహవన, చండీహవనం చేపట్టారు.



లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

రాత్రి హనుమాను మూర్తులకు సహస్రనామార్చనలు, నివేదన నీరాజనం, మంత్రపుష్పములు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు తీర్థప్రసాద వితరణ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకుడు రామరావు, పూజారి దోర్బల శ్రీధరశర్మ, ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పందేలు



రఘునాథపాలెంలో జరిగిన పోటీలో పాల్గొన్న ఒంగోలు గిత్తలు

మఠంపల్లి, ఏప్రిల్ 19: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో కొలువైన శ్రీకోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేల పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఒంగోలు గిత్తలు తరలివచ్చాయి. తొలిరోజు జతపండ్ల విభాగంలో ఏపీలోని గుంటూరు, పల్నాడు, కృష్ణా జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల నుంచి 10 జతల గిత్తలు పోటీపడ్డాయి. జతపండ్ల విభాగంలో గెలుపొందిన విజేతలకు రూ.1,01,000 నగదు బహుమతిగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అప్పయ్య, ఎన్నారై బొగ్గుల మౌలాలి, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీటీసీ చెన్నయ్య, వెంకటనారాయణ, బాలసైదా, సీతారాంరెడ్డి, ఫకీర అహ్మద్, లక్ష్మయ్య, జానయ్య, జమీల్, నరసింహారావు, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భద్రారెడ్డి, పుల్లారెడ్డి, కోటయ్య, రవీందర్‌రెడ్డి, జోజి తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టును ఎడారిగా మార్చారు : జగదీష్‌రెడ్డి

అర్వపల్లి / హుజూర్‌నగర్, ఏప్రిల్ 19: కాళేశ్వరంతో గోదావరి జలాలు తేలేక ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతాన్ని పాలకులు ఎడారిగా మార్చారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి, హుజూర్‌నగర్‌లలో జరిగిన పార్టీ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. అర్వపల్లి యోగానందలక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌తో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం అర్వపల్లి మండలకేంద్రంలో నిర్వహించిన భారీ ర్యాలీలో జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు నాలుగు నెలలైనా రూ.2500 హామీ నెరవేర్చలేదన్నారు. ఆసరా పింఛన్ల పెంపు ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీచైర్‌పర్సన్ గుజ్జా దీపికాయుగేందర్‌రావు, భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బూడిద బిక్షమయ్యగౌడ్, దావుల వీరప్రసాద్‌యాదవ్, జీడి బిక్షం పాల్గొన్నారు. అదేవిధంగా హుజూర్‌నగర్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని జగదీష్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రజలను, రైతులను మోసం చేసిందన్నారు.


అర్వపల్లి ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, కొప్పుల సైదిరెడ్డి, ముల్కలపల్లి రాంబాబు, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నర్సింగ్ వెంకటేశ్వర్లు, పార్వతీ, కొండానాయక్, సైదులుయాదవ్, బసవయ్య, బ్రహ్మారెడ్డి, గుజ్జుల అంజిరెడ్డి, కృష్ణంరాజు, ఉపేందర్‌యాదవ్, పిచ్చయ్య, వెంకటరెడ్డి, తోట శేషు, జక్కుల నాగేశ్వరరావు, బెల్లంకొండ అమర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధిచెబుతారు


శాలిగౌరారంలో బీఆర్ఎస్ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

శాలిగౌరారం, ఏప్రిల్ 19 : అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెబుతారని భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ప్రచారంలో వారు మాట్లాడారు. మల్లేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో అన్నివర్గాలను ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. రైతులకు, మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. అమలు కానీ హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ 150రోజుల్లో ఏఒక్కటీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. జిల్లాను శాసించే కోమటిరెడ్డి బ్రదర్స్ ఏ ఒక్క ప్రాజెక్టు కట్టలేదని పూటకో మాట మాట్లాడుతూ పార్టీలోనే వారిని వారు కంగారు పెడుతున్నారన్నారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి భూకబ్జాలు చేసిన నాయకుడు అన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తానన్నారు. అంతకుముందు మల్లేష్‌కు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలేరు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, రవీంద్రకుమార్, యాదాద్రిభువనగిరి జిల్లా జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయితగోని వెంకన్నగౌడ్, చాడ హరీష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మామిడి సర్వయ్య, కట్ట వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, చంద్రమౌళి, శోభన్ బాబు, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గురించి మాట్లాడటం టైం వేస్ట్

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 19 : మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుల గురించి మాట్లాడడం టైం వేస్ట్ అని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో నల్లగొండ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ పనైపోయిందని రాష్ట్రంలోని ఏఒక్క పార్లమెంట్ స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్ కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ మిగిలే పరిస్థితి లేదని మతిభ్రమించి కేసీఆర్ అర్థరహిత వాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 20 మంది బీఆర్ఎస్‌లోకి రావడం కోసం టచ్‌లో ఉన్నారని మాజీ కేసీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. త్వరలోనే 20 నుంచి 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి రావడానికి సిద్ధగా ఉన్నారని తెలిపారు. దేశచరిత్రలోనే నల్లగొండ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు.

కాంగ్రెస్ కంచుకోట ఉమ్మడి జిల్లా: జానారెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కంచుకోట అని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. సూర్యాపేటకు తనకు అవినాభావ సంబంధం ఉందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అద్భుత పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశంలోనూ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అవినీతి, సంస్కారం లేని పాలన బీఆర్ఎస్ చేసిందని ఆరోపించారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి: రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. రఘువీర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రతి ఒక్కరి సమస్యపై పార్లమెంట్‌లో గళమెత్తుతాడని అన్నారు. ఎన్నికల తర్వాత పేదలకు ఇండ్లు అందేలా చూస్తామన్నారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను గుర్తించి ఇందిరమ్మ కమిటీలో చేర్చడం జరుగుతుందన్నారు. ఈ కమిటీ సభ్యులకు నెలకు రూ.6 వేల వేతనం అందేలా వేతనం అందించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు.

దేశభవిష్యత్తును మార్చే ఎన్నికలు : పటేల్ రమేష్‌రెడ్డి

ఈ ఎన్నికలు దేశభవిష్యత్తును మార్చే అవకాశం ఉందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గడిచిన 10ఏళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుందన్నారు. బీజేపీ ప్రభుత్వం నల్లధనం పేరుతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏఒక్కరి ఖాతాలో నల్లధనం రూ.15లక్షలు వేయలేదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

అవకాశం ఇస్తే ప్రజల గొంతుకవుతా: రఘువీర్‌రెడ్డి

తనను గెలిపిస్తే ప్రజల గొంతుకనై పార్లమెంట్‌లో గళమెత్తుతానని నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో 12అసెంబ్లీ స్థానాలకు 11 స్థానాలు గెలిచామని కేవలం సూర్యాపేటలో మాత్రమే పార్టీ ఓడిందన్నారు. కొంతమంది బీటీం మూలంగా సూర్యాపేటలో కొన్ని ఎన్నికల నుంచి ఓటమి చూస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సూర్యాపేట నుండే అత్యధిక మెజార్టీ వచ్చే అవకాశం ఉందన్నారు.

ఫ్లెక్సీలో ఫొటో లేదని ఆందోళన

ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశ బ్యానర్‌లో తమ నాయకుడు పటేల్ రమేష్‌రెడ్డి ఫొటో లేదంటూ కార్యకర్తలు ఆందోళన చేస్తూ నినాదాలు చేశారు. వేదికపై ఉన్న పటేల్ రమేష్‌రెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో పాటు జానారెడ్డి వారించే ప్రయత్నం చేసినా నినాదాలు ఆపలేదు. 15 నిమిషాల వరకు కార్యకర్తలు నినాదాలు చేశారు. జానారెడ్డి మైకు అందుకొని కార్యకర్తలను మందలించారు. దీంతో శాంతించారు. కార్యక్రమంలో సూర్యాపేట, నల్లగొండ డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, ఏఐసీసీ సభ్యులు సర్వోత్తంరెడ్డి, పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్‌యాదవ్, చకిలం రాజేశ్వర్‌రావు, పోతు భాస్కర్, అంజద్‌అలీ, అబ్దుల్ రహీం, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారసభను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ రూరల్ : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఈనెల 21న నిర్వహించే నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ప్రచార సభను విజయవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం ప్రచారసభ నిర్వహించే రాజీవ్‌గాంధీ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఆయన వెంట తన్నీరు మల్లికార్జున్‌రావు, గూడెపు శ్రీనివాసు గెల్లి అర్చనరవి, దొంగరి వెంకటేశ్వర్లు, మంజూనాయక్, కుంట సైదులు, శివరామ్‌యాదవ్, మజీద్, గురవయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కలలను ప్రజలు భగ్నం చేయాలి

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 19 : మూడోసారి అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని మార్చాలని కలలు కంటున్న బీజేపీ ఆశలను ఓటర్లు భగ్నం చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. భువనగిరి సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ శుక్రవారం నామినేషన్ దాఖలా చేసిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విచ్ఛిన్నకర శక్తిగా ఎదుగుతున్న బీజేపీని తుదముట్టించడం సీపీఎం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో మెజార్టీ సీట్లను గెలుస్తామంటున్న బీజేపీకి సీపీఎం రాష్ట్రమంతటా గుణపాఠం చెబుతుందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాల్సిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కలహాలతో కాలం వెళ్లదీస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ మీద విశ్వాసం కోల్పోయిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే సీఎం రేవంత్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేస్తున్నారని విమర్శించారు. కేరళ సీపీఎం ప్రభుత్వంపై సీఎం రేవంత్ అవినీతి ఆరోపణలు చేయడం ద్వారా నవ్వుల పాలయ్యాడని విమర్శించారు. భువనగిరి ఎంపీగా సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో భువనగిరి నియోజకవర్గంతో పాటు తెలంగాణ సమస్యలపై పోరాడే బాధ్యతను సీపీఎం పార్టీ తీసుకుంటుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సీపీఎం భువనగిరిలో మాత్రమే పోటీచేస్తూ మిగతాస్థానాల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజల అభీష్టం మేరకు కాంగ్రెస్ పాలన సాగడం లేదన్నారు. సీఎం వైఖరి ఆ పార్టీకి తీరని నష్టం చేకూరుస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా గొంతుకనవుతానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ వీరయ్య, చుక్క రాములు, కొండమడుగు నర్సింహ, తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, బట్టుపల్లి అనురాధ, డీవైఎఫ్‌వై రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, నాయకులు మాటూరి బాలరాజు, దోనూరు నర్సిరెడ్డి, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి, ఎండీ పాషా, దయ్యాల నర్సింహ, వనం రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మాదిరే బీజేపీని ఓడించాలి


మోత్కూరులో ప్రచారం నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, సామేల్

మోత్కూరు / అడ్డగూడూరు/ శాలిగౌరారం, ఏప్రిల్ 19 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించినట్టే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వని ఓడించాలని భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంతో పాటు అడ్డగూడూరు మండల కేంద్రం, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా ఈ ఎన్నికల్లోనూ కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కోఆప్షన్ సభ్యురాలు పోల్నేని ఆనందమ్మ, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కారుపోతుల వెంకన్న పాల్గొన్నారు.

● అడ్డగూడూరులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోలేబోయిన లింగయ్య, ఎంపీటీసీ పెండ్యాల భారతమ్మ, సీనియర్ నాయకులు ఇటీకాల చిరంజీవి, నిమ్మనగోటి జోజీ, పాశం సత్యనారాయణ, గూడేపు పాండు ఉన్నారు.

● శాలిగౌరారం మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకుల చామల మహేందర్‌రెడ్డి, చాడ సురేష్‌రెడ్డి, గోదం నరేందర్‌రెడ్డి, చాడ లోకేందర్‌రెడ్డి, ఎంపీటీసీ జోగు సైదమ్మశ్రీనివాస్, పరమేష్, కట్టంగూరు సురేందర్‌రెడ్డి, పాదూరి శంకర్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

హాలియా, ఏప్రిల్ 19: ప్రధాని నరేంద్రమోదీ అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశం ఎంతో ముందుకెళ్తుందని నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా హాలియాలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీజేపీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గ్రామానికి అందుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి సైలెంట్ ఓటింగ్ పడుతుందన్నారు. ప్రధానంగా యువకులు, మహిళలు పార్టీకి అండగా నిలుస్తున్నారని తెలిపారు. నల్లగొండ జిల్లాలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. మచిలీపట్నం, నెల్లూరు పోర్టులకు అనుసంధానం చేస్తే జిల్లాలో యూత్‌కు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు కంకణాల నివేదితరెడ్డి, జిల్లా నాయకులు చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చలమల వెంకట్‌రెడ్డి, జూలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, నంద్యాల ప్రవీణ్, స్వాతి, శంకర్, కత్తి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి గుట్ట గుహలో అరుదైన శిల్పం


గుహలోని రాయిపై ఉన్న శిల్పాన్ని చూపిస్తున్న రత్నాకర్‌రెడ్డి

నాగారం, ఏప్రిల్ 19: సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఫణిగిరి గుట్ట మధ్యన గుహలో అరుదైన శిల్పం, శివలింగాలను చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి గుర్తించారు. శుక్రవారం గుహను పరిశీలించారు. అందులో అరుదైన శివలింగాలు, పార్వతీదేవి, భైరవుడి శిల్పాలను కనుగొన్నారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఫణిగిరి గ్రామానికి పురాతన చరిత్ర ఉందని, ఇక్ష్వాకుల కాలం నుంచి కాకతీయుల వరకు ఫణిగిరి ప్రభావితమైందని ఆయన తెలిపారు. కాకతీయులు శైవ భక్తులు కావడంతో ఫణిగిరి గుట్టపై శివుడి ఆలయం నిర్మించారన్నారు. అరడుగుల పొడువు, నాలుగు అడుగుల వెడల్పు కలిగి ఉన్న గుహలో రెండు శివలింగాలు, పార్వతీదేవి శిల్పం ఉన్నాయని ఆయన తెలిపారు. భక్తులు శివలింగాలను అభిషేకం చేసిన నీటిని బయటకు వెళ్లేలా రంధ్రాన్ని తొలిచారని ఆయన అన్నారు. తెలంగాణ చరిత్రకు ఫణిగిరి గుట్టలో ఉన్న గుహలు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.

వ్యక్తిగత అవసరాల కోసం దొంగతనాలు

● అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 19 : వ్యక్తిగత అవసరాల కోసం వరుస దొంగతరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితుడిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్టుచేశారు. అతడి నుంచి రూ.16.24 లక్షల విలువైన 20.3 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడి వివరాలను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ పట్టణంలోని బొంబాయికాలనీకి చెందిన దేవరకొండ రాంబాబు వృత్తిరీత్యా పూలవ్యాపారి. ఆ వ్యాపారంలో లాభాలు రాకపోవడంతో వ్యక్తిగత అవసరాల కోసం దొంగతనాలను చేయడం ప్రారంభించాడు. గతంలో దొంగతనం కేసులో రాంబాబు జైలుకు వెళ్లివచ్చాడు. జైలు జీవితం అనంతరం తిరిగి ఈ ఏడాది జనవరి చివరలో బయటకువచ్చాడు. జైలుకు వెళ్లివచ్చినా అతడిలో మార్పు రాకపోవడంతో తిరిగి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈసారి ఆంధ్ర ప్రాంతంలోనే కాకుండా తెలంగాణలో దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీన మిర్యాలగూడకు విద్యానగర్ కాలనీకి చెందిన మౌర చంద్రశేఖర్ ఇంట్లో దొంగతనం చేశాడు. రూ.50 వేల నగదు, బంగారు ఆభరణాలు దొంగిలించాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్థానిక ఈదులగూడ చౌరస్తాలో ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న రాంబాబును అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. జైలు జీవితం అనంతరం ఈ ఏడాది జనవరి 30న మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణానగర్‌లో, ఫిబ్రవరి 9న ఏపీలోని గుడివాడలోని పురం సాయిరాం అపార్ట్‌మెంట్‌లో, 18న విజయవాడ హనుమాన్ జంక్షన్‌లోని బాపులపాడులో, అదే నెల 26న మిర్యాలగుడ మండలం తుంగపహాడ్‌లో, మార్చి 26న కల్వకుర్తిలోని విద్యానగర్‌లో, 29వ తేదీన మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డలో వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. మొత్తం ఏడు కేసుల్లో సుమారు రూ.16.24 లక్షల విలువైన 20.3తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించి అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. రాంబాబును పట్టుకుని కేసు ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ జీ సుధాకర్, ఎస్ఐ రవి, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

రూ.లక్ష నగదు పట్టివేత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో నగదుతో పాటు ఇతర వస్తువులు పట్టుబడుతున్నాయి.


ఈదులపర్రైతండా చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తిరుమలగిరి, ఏప్రిల్ 19: ఎన్నికల కోడ్ నేపథ్యంలో సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఈదులపర్రైతండా వద్ద చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో శుక్రవారం రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కారులో జనగాం జిల్లాకు చెందిన మాచర్ల గోపి వద్ద ఎలాంటి ఆధారాలు లేని లక్ష రూపాయలను స్వాధీనం చేసుకుని, రిటర్నింగ్ అధికారికి అందజేశామన్నారు.

కోదాడలో రూ.1.25 లక్షల విలువైన దుప్పట్లు

కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రాష్ట్ర సరిహద్దులోని రామాపురం చెక్‌పోస్టు రూ.1.25 లక్షల విలువైన దుప్పట్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన గాదె నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మచిలీపట్నం నుంచి హుజూర్‌నగర్‌కు రూ.1.25 లక్షల విలువైన దుప్పట్లను తరలిస్తుండగా తనిఖీల్లో గుర్తించినట్లు తెలిపారు. సీజ్ చేసిన దుప్పట్లను ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

తాటిచెట్టును ఢీకొన్న కారు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి

తిప్పర్తి, ఏప్రిల్ 19 : తాటిచెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ డీ రాజు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుంటి జ్ఞానేశ్వర్(57) నల్లగొండ జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో బంధువులు మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం కుమారుడు శ్రీకాంత్, మిత్రులు తంగరాజు గణేష్, బొడ్డు జీవన్‌కుమార్‌లతో కలిసి ఈ నెల 17వ తేదీన రాత్రి బయలుదేరి 18న రాజమండ్రిలో అంత్యక్రియల్లో పాల్గొని అదే రోజు రాత్రి తిరిగి నల్లగొండకు బయలుదేరాడు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో పెద్దసూరారం గ్రామ పరిధిలోని బొల్లేపల్లికి వెళ్లే దారి వద్దకు రాగానే రోడ్డుకు అడ్డంగా అడవి పందులు వచ్చాయి. ఈ క్రమంలో కారు నడుపుతున్న శ్రీకాంత్ వాటిని తప్పించబోయి కారును పక్కన ఉన్న తాటిచెట్టుకు ఢీకొట్టాడు. దీంతో ముందు సీట్లో కూర్చున్న జ్ఞానేశ్వర్‌కు కడుపులో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కారులో ఉన్న మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. జ్ఞానేశ్వర్‌కు భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బావిలో పడి పశువుల కాపరి మృతి

కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండలో బావిలోపడి పశువుల కాపరి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లు(48) పశువులు కాసుకుంటూ గురువారం గ్రామశివారులోకి వెళ్లాడు. దాహం వేయడంతో వ్యవసాయ బావిలోకి దిగి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు తెలిపారు. వెంకటేశ్వర్లు భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హుజూర్‌నగర్‌లో వడదెబ్బతో వ్యక్తి ...



హుజూర్‌నగర్ : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో కస్తాల మహేష్ (45)వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. మహేష్ మేళ్లచెర్వు రోడ్డులోని ఎన్‌సీఎస్ ట్రాన్స్‌పోర్ట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజులుగా ఎండదెబ్బకు గురైన మహేష్‌ను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లులపై కేసు నమోదు

తిరుమలగిరి, ఏప్రిల్ 19: కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా, ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లు యజమానులపై కేసు నమోదైంది. స్థానిక సంతోష్ రైస్‌ఇండస్ట్రీస్ యజమాని ఇమ్మడి సోమనర్సయ్య, అంజయ్య, సోమయ్యలపై సివిల్ సప్లయ్ అధికారుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 16వ తేదీన అదనపు కలెక్టర్, ఆర్డీవో, సివిల్ సప్లయ్ అధికారులు సంతోష్ రైస్ ఇండస్ట్రీస్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై దాడులు నిర్వహించి వివరాలు సేకరించారు. సంతోష్ రైస్‌మిల్ నుంచి రూ.91.31 కోట్లకు సంబంధించిన 41,365 మెట్రిక్‌టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉన్నట్లు తేల్చారు. ఈఘటనపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబు ఫిర్యాదు మేరకు మిల్లు యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

నాగారం: సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఈటూరు పరిధిలోని ప్రగతినగర్‌లో ఉన్న రఘురాం రైస్ ఇండస్ట్రీస్ యాజమానలైన ఇమ్మడి సోమనర్సయ్య, ఇమ్మడి అంజయ్య, ఇమ్మడి సోమయ్యలపై సివిల్ సప్లయ్ డీఎం రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. రైస్‌మిల్లుకు 2022-23 యాసంగి సీజన్, 2023-24 వానాకాలం సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 3,5001 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుకు సరఫరా చేశారు. వాటి విలువ రూ.7.71 కోట్లుగా సివిల్ సప్లయ్ అధికారులు తేల్చారు. ఆ ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం మిల్లు యాజమాన్యంపై సివిల్ సప్లయ్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు ఇమ్మడి సోమనర్సయ్య, ఇమ్మడి అంజయ్య, ఇమ్మడి సోమయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కనగల్ వాగులో భారీగా మంటలు

కనగల్, ఏప్రిల్ 19 : నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలోని కనగల్ గ్రామవాగులో శుక్రవారం సాయంత్రం భారీగా మంటలు వ్యాపించాయి. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు వాగులోని జమ్మిగడ్డికి నిప్పంటించగా పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. మంటల కారణంగా చుట్టుప్రక్కల ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. వాగుఒడ్డున రైతులు ఏర్పాటుచేసుకున్న వ్యవసాయమోటర్లు, స్టాటర్లు, విద్యుత్‌వైర్లు, పైపులు దగ్ధం కాగా లక్షల్లో నష్టం వాటిల్లింది. మరోపక్క వాగులోని చిన్నచిన్న జీవులు మంటల్లో చిక్కి మృత్యువాతపడ్డాయి. నెలరోజుల్లో ఇలా వాగులో మంటలు చెలరేగటం ఇది నాలుగోసారి. ఇసుక తవ్వకాల కోసమే అక్రమార్కులు మంటలను సృష్టిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సదరు దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే సంబంధిత అధికారులు స్పందించకపోవటంతో అక్రమార్కులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చౌటుప్పల్ రూరల్ , ఏప్రిల్ 19 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఓం సాయి ప్లాస్టిక్ గోదాంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కాలిబూడిదయ్యాయి. మంటలతో ఎలాంటి ప్రాణహానీ జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సంఘటనా ప్రాంతానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. పోలీసులు సైతం మంటలను ఆర్పివేయడంలో సహకరించారు. పక్కనే రసాయన పరిశ్రమ ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

బత్తాయి తోట దగ్ధం

మాడ్గులపల్లి : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో బత్తాయి తోట దగ్ధమైంది. జాలువర్తి నాగేశ్వర్‌రావు బత్తాయి తోటకు సమీపంలో వారం రోజుల క్రితం ఉపాధికూలీలు పనులు చేస్తుండగా కంపచెట్లు ఉండడంతో వాటికి నిప్పు అంటించారు. మంటలు ఎక్కువగా వ్యాపించడంతో సుమారు 30 బత్తాయి చెట్లు కాలిపోయాయని రైతు నాగేశ్వర్‌రావు తెలిపారు. హైద్రాబాద్‌లోని ఉపాధిహామీ అధికారులకు శుక్రవారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదుచేశారు. కాలిపోయిన 30 చెట్లకు నష్ట పరిహారం అందించాలని కోరారు.

మండలంలో నీటిఎద్దడిని నివారిస్తాం : ఎంపీడీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమేష్‌చారి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 19: ప్లాన్ ఏ,బీ,సీ ప్రకారం వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అన్నిరకాలుగా సిద్ధంగా ఉన్నామని ఎంపీడీవో ఉమేష్‌చారి తెలిపారు. మండల కేంద్రంలో తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ మంచినీటిని అందిస్తున్నామని, నీటి ఎద్దడి ఎదురైనా మంచినీటిని అందించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 85 ఓహెచ్ఎస్ఆర్‌ల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. సాగర్‌లో వానరాల మృత్యువాత సంఘటన నేపథ్యంలో ప్రతీ నెలా 1, 11, 21వ తేదీల్లో నీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో నీటి సమస్య ఎదురైతే అప్పటికప్పుడే పరిష్కరించేందుకు నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీవో తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ్, కార్యాలయ పర్యవేక్షకుడు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్‌లో వ్యర్థాలతో దుర్వాసన

● శుభ్రం చేయని మునిసిపల్ సిబ్బంది


సాగర్ హైలాన్‌కాలనీలో శివాలయం వద్ద వ్యర్థాలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 19: నాగార్జునసాగర్ హైలాన్ కాలనీలో 2016లో పుష్కరాల సమయంలో రూ. 4 కోట్ల వ్యయంతో వీఐపీ పుష్కర ఘాట్‌ను నిర్మించారు. పుష్కరాల అనంతరం ఏకాదశి, మహాశివరాత్రి పర్వదినాలతో పాటు కర్మకండలు నిర్వహించుకోవడానికి ఈ పుష్కరఘాట్‌లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, భక్తులు వస్తుంటారు. కర్మకాండలు నిర్వహించుకనే సమయంలో కృష్ణానదిలో అస్థికలు ఇక్కడే నిమజ్జనం చేస్తారు. అంతే కాకుండా తలనీలాలు కూడా సమర్పించుకుంటారు. అలాగే శనిపూజలు పెట్టించుకొని ఆ దుస్తువులను ఇక్కడే వదిలేసి వెళ్తుంటారు. వ్యర్థాలు అన్ని పుష్కరఘాట్‌లో కృష్ణానది ఒడ్డుకు కొట్టుకొని వచ్చి దుర్వాసన వెలువడుతుంది. దీంతో పుణ్యస్నానాల కోసం ఇక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి పుష్కర ఘాట్ల వద్ద వ్యర్థాలను తొలగించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

ఓటు హక్కుపై మహిళలకు అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న మెప్మా పీడీ కరుణాకర్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 19: మహిళలు ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని మెప్మా పీడీ కరుణాకర్ తెలిపారు. సాగర్ హిల్‌కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం డ్వాక్రా మహిళా సంఘాల మహిళలకు ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగర్‌లో మహిళల ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుందని, అలా కాకుండా తమ చేతుల్లో ఉన్న వజ్రాయుధం లాంటి ఓటును తప్పక వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీను, మెప్మా టీఎంసీ వసంత్‌కుమార్, మునిసిల్ సిబ్బంది మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.

సర్వే సకాలంలో పూర్తి చేయాలి

హాలియా, ఏప్రిల్ 19: అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలోని కుటుంబాల సర్వేను సకాలంలో పూర్తి చేయాలని సీడీపీవో గంధం పద్మావతి అన్నారు. పట్టణ సమీపంలోని కొత్తపల్లి రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. టీచర్లు చేసే సర్వే, గ్రోత్ మానిటరింగ్, ఎన్‌హెచ్‌టీఎస్‌లో సర్వేలో వచ్చిన నమోదు కానీ పేర్ల గురించి వివరించారు. ఈ నెలలో నిర్వహించే ప్రీ స్కూల్ అసిస్మెంట్ గురించి, వారి యొక్క అభివృద్ధి సూచికల గురించి వివరించారు. మెడిటేషన్ గురించి నిపుణులైన వాసు ధ్యానం చేయిం చారు. సమావేశంలో సూపర్‌వైజర్లు రమాదేవి, సరిత, కమలాబాయి, వెంకాయ మ్మ, గౌస్య, విజయలక్ష్మి, యాదమ్మ, రాజరాజేశ్వరి, సైదాబేగం, పోషణ్ అభియాన్ బీసీ పవన్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

24 షుగర్‌కు ఉచిత ఆయుర్వేద మందు పంపిణీ

మిర్యాలగూడ, ఏప్రిల్ 19: బోధి ధర్మ ఆయుర్వేద పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన మధుమేహ వ్యాధికి ఉచిత ఆయుర్వేద మందు పంపిణీ చేయనున్నట్లు పండిట్ శ్రీనివాస్ గురూజీ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఉచిత మందు పంపిణీ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో నూటికి 45 శాతం మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుర్వేదంలో శిలాజిత్ మూలికలతో వ్యాధిని పూర్తిగా నయం చేసే వీలుందన్నారు. ఈ ఔషధాన్ని ఈ నెల 24వ తేదీన జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మునీర్ చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడలో బుధ, గురు, శుక్రవారాలు, హైదరాబాద్‌లో శని, ఆదివారాల్లో మందు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు డీసీసీబీ డైరెక్టర్ 'విరిగినేని' రాజీనామా

నిడమనూరు, ఏప్రిల్ 19: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి జిల్లాలో ముఖ్య నాయకుడిగా ఉన్న డీసీసీబీ డైరెక్టర్, నిడమనూరు సింగిల్ విండో చైర్మన్ విరిగినేని అంజయ్య ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను అధిష్ఠానానికి పంపినట్లు తెలిపారు. అవసరమైతే డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ పదవులకు కూడా రాజీనామా చేస్తానని వెల్లడించారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన అంజయ్య బీఎస్పీలో చేరి ఆ పార్టీ తరపున నల్లగొండ పార్లమెంట్ నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.


బడుగులకు కాంగ్రెస్ అండ

● కాంగ్రెస్‌లో పలువురు నాయకుల చేరిక


నరేందర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మిర్యాలగూడ, ఏప్రిల్ 19: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. తిప్రురారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బహూనూతుల నరేందర్ శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేసి 200 మంది అనుచరులతో డీసీసీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నరేందర్‌కు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామిక పరిపాలన చూసి, 6 గ్యారెంటీలకు ఆకర్షితులై వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్ల నిరంకుశ, అరాచక పాలనపై ప్రజల్లో ఇంకా ఆగ్రవేశాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. తవ్విన కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయన్నారు. అధికారం, అండతో నిబంధనలను అతిక్రమించి సంపదను పోగేసుకున్న వారందరికీ శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో 6 గ్యారెంటీల సంక్షేమ పథకాల లాగే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాంచ్‌న్యాయ్ పథకాలను అమలుచేయనున్నట్లు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలన్నారు. అనంతరం బహూనూతుల నరేందర్ మాట్లాడుతూ సాగర్ నియోజకవర్గంలో జానారెడ్డి హయాంలోనే అభివృద్ధి జరిగిందని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, పెద్దదేవులపల్లి ఎంపీటీసీ అంబటి రాము, నాయకులు పసుల శ్రీకాంత్, సింగం ముత్తయ్య, గాలి మల్లేష, గుండెబోయిన రామయ్య, బుడిగె సోమన్న, కొల్లి రాజు,రవి, చాంద్‌పాషా, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ముఖ్యనేతలు


జడ్పీటీసీ సురేందర్‌రెడ్డి, నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మర్రిగూడ: మునుగోడు నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీలో వివిధ పార్టీల నుంచి చేరికల పర్వం మొదలైంది. ప్రధానంగా బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులతో పాటు పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీకి షాకిచ్చారు. మర్రిగూడ మండల బీఆర్ఎస్ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని బీమనపల్లి, తిరుగండ్లపల్లి, శివన్నగూడకు చెందిన ఆ పార్టీ ఎంపీటీసీలు చిలువురు విష్ణుప్రజాపతి, గండికోట రాజమణిహరికృష్ణ, దాసరి మమతగోపాల్, వట్టిపల్లి, ఎరుగండ్లపల్లి, ఖుదాబక్షిత్‌పల్లి, అంతంపేట, కొట్టాల గ్రామాలకు చెందిన ఆ పార్టీ తాజా మాజీ సర్పంచులు స్వాతినవీన్‌రెడ్డి, మాడం శాంతమ్మవెంకటయ్య, ఆంబోతు సుధాకర్, మాదగోని శేఖర్, గంట కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డితో పాటు పలు గ్రామశాఖల అధ్యక్షులు, వార్డు సభ్యులు, మండల ముఖ్య నాయకుల అనుచరులు మొత్తం 350 మంది బీఆర్ఎస్‌ను వీడారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేసిన ఉద్యమనాయకుడు, మునుగోడు మండల మాజీ అధ్యక్షుడు, సింగారం తాజీ మాజీ సర్పంచ్ గుర్రాల పరమేష్, మునుగోడు మేజర్ గ్రామ ఇండిపెండెంట్ తాజా మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, బీఆర్ఎస్‌కు చెందిన ఉపసర్పంచ్ పందుల పవిత్ర భర్త పందుల శ్రీను తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌కు ఆకర్షితులయ్యారు. భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వారందరూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వానికి ఆకర్షితులై తమ పార్టీలో చేరిన అందరికి సముచిత గుర్తింపు ఉంటుందని, వారందరికీ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

ఓట్లు వేయిద్దాం.. కోట్లు తెచ్చుకుందాం: వీరేశం


చిట్యాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, చిట్యాల, కట్టంగూరు, ఏప్రిల్ 19: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి గంపగుత్తగా ఓట్లు వేయించుకోవడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి కోట్లు తెచ్చుకుందామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి, చిట్యాలలో శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి ఎంపీ నియోజకవర్గ పరిధిలోని నకిరేకల్‌లో రికార్డు మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు చాలెంజ్‌గా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీ తెచ్చుకోవడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా రాణించవచ్చని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ ఉనికి కోసం ఆరాట పడుతున్నాయని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, బీజేపీకి కనీసం బూత్ కమిటీ సభ్యులు లేరని బీఆర్ఎస్ ఉనికి కోసం పోరాడుతుందన్నారు. పదేళ్లలో బీజేపీ దేశానికి చేసిందేమీ లేదని, ప్రధాని మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించి ఓట్లు అడగాలని కోరారు. నార్కట్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణ, మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు బండా సాగర్‌రెడ్డి, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, నట్టు సత్తయ్య, ఐతరాజు యాదయ్య, నేతకాని కృష్ణయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, కొంపెల్లి సైదులు, జెరిపోతుల భరత్, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, ప్రజ్ఞాపురం సత్తి, చింత శరత్, చిట్యాలలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు గుడిపాటి లక్ష్మీనర్సు, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, కాటం వెంకటేశం, ఎద్దులపురి కృష్ణ, శేపూరి యాదయ్య, పరమేశం పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. కట్టంగూరులో శుక్రవారం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు వచ్చిన మెజార్టీ కంటే ఎంపీ ఎన్నికల్లో ఎక్కువ వచ్చేందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, లింగస్వామి, జెజవాడ సైదులు, గడుసు సుధీర్‌రెడ్డి, వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, బూరుగు శ్రీను, ధార భిక్షం, పెద్ది యాదగిరి, మిట్టపల్లి శివశంకర్, పాలడుగు హరికృష్ణ, నర్సింహ, స్వామి, వెంకన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారినే ఎన్నుకోవాలి


● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి


ర్యాలీలో ఎంపీ అభ్యర్థి మట్టయ్యకు పూలమాల వేస్తున్న రవి

మిర్యాలగూడ, ఏప్రిల్ 19: చట్టసభల్లో ప్రజా సమస్యలపై గళమెత్తే వారినే ఎన్నికల్లో గెలిపించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ స్థానానికి ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా వస్కుల మట్టయ్య శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడలో ఫ్లై ఓవర్ వద్ద నుంచి రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న మట్టయ్య పార్లమెంట్‌కు ఎన్నికైతే పేదలకు మేలు జరుగుతుందని అన్నారు. మతం పేర దేవుళ్లని రాజకీయాల్లోకి రప్పిస్తున్నారని విమర్శించారు. బీఎల్ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐ(యూ) అభ్యర్థి వస్కుల మట్టయ్యను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరికుప్పల వెంకన్న, సూర్యాపేట జిల్లా కార్యదర్శి ఎస్‌కె.నజీర్, నల్లగొండ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు ఏపూరి సోమన్న, నాగార్జున, పెతుగంటి కాశి, కిరణ్, భరత్, విశాలాంధ్ర అనిల్, చంద్రకళ, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

23న వీర హనుమాన్ విజయయాత్ర

నల్లగొండ, ఏప్రిల్ 19: వీర హనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని భజరంగదళ్ రాష్ట్ర కో-కన్వీనర్ కన్నెబోయిన వెంకట్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తులసీనగర్ ఆంజనేయస్వామి దేవాలయం ప్రచారరథాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన జరిగే వీర హనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని కోరారు. విజయ యాత్రలో హిందూ బంధువులందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాయలకృష్ణ, సంపత్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న వెంకట్

డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా జగన్మోహన్‌రెడ్డి


నియామకపత్రాన్ని అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, ఏప్రిల్ 19: డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మర్రిగూడ మండలం తమడపల్లి గ్రామానికి చెందిన మేకల జగన్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ నియమిస్తున్నట్లు నియామక పత్రం జారీ చేశారు. శుక్రవారం మునుగోడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జగన్మోహన్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచులు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, జగన్మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

నేడు దామరచర్లలో బీఆర్ఎస్ రోడ్ షో

● పాల్గొననున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి

దామరచర్ల, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం దామరచర్ల మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోడ్‌షోలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ రోడ్‌షో మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ నుంచి సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుందనితెలిపారు. బొడ్రాయి వరకు కొనసాగి అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున బీఆర్ఎస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎల్లారెడ్డిగూడెం సోమచెరువు మట్టి లూటీ

● అడ్డుకున్న మత్స్య సొసైటీ సభ్యులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్19: మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, ఎం.ఎడవెల్లిలలో ఇటీవల చెరువుల నుంచి మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు మాత్రం తూతూ మంత్రంగానే చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో చెరువును యథేచ్ఛగా ఎక్స్‌కవేటర్ల సాయంతో తవ్వుతూ మట్టిని విక్రయిస్తున్నారు. దీంతో సంబంధిత చెరువుల మత్స్య సొసైటీలే అడ్డుకుంటున్నాయి. మండలంలోని ఎల్లారెడ్డిగూడెం సోమసముద్రం చెరువు నుంచి కొన్ని రోజులుగా మట్టిని అ క్రమంగా తరలిస్తున్నారు. దీనిపై గ్రామానికి చెందిన కొందరు తహసీల్దార్, పోలీస్, ఐబీ అధికారులకు సమాచారం అందించారు. అయితే సంబంధిత అధికారులు కేవలం హెచ్చరికలతోనే సరిపెడుతుండటంతో మట్టి తరలింపు ఆగటం లేదు. తాజాగా శుక్రవారం కూడా సోమసముద్రం చెరువులో ఎక్స్‌కవేటర్‌ను ఉపయోగించి మట్టిని తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా మరోచోటికి తరలించి డంప్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మత్స్య సొసైటీ సభ్యులు ఎనుగుల చంద్రశేఖర్, శ్రీను, నల్ల నాగరాజు, చంద్రశేఖర్, గంగదేవి గణేష్‌లు మట్టి తరలింపును అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై మరోసారి అధికారులకు ఫిర్యాదు చేశారు.

శోభాయమానంగా దివ్య రథోత్సవం


నల్లగొండలో జరిగిన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రంలోని రామగిరిలో గల సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారి దివ్య రథోత్సవం శోభాయమానంగా సాగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులను చేశారు. మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. రథోత్సవానికి అడుగడుగునా భక్తులు నీరాజనాలు పలికారు. మహిళల కోలాట ప్రదర్శనలు, చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు కోలాహలంగా సాగాయి. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, ఆలయ ఈవో జయరామయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, నాయకులు వంగాల అనిల్‌రెడ్డి, జీవీయాదవ్, వికాస్ తరంగిణి బాధ్యులు అర్చకస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

చండూరురూరల్: చండూరు మండలం చామలపల్లి గ్రామంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విమాన రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి దేవాలయ కమిటీ చైర్మన్ మేక రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు నేర్లకంటి రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామస్థులు రాసాల ఆంజనేయులు, ముంత వెంకటయ్య, నెర్లకంటి వెంకన్న, గొల్లూరి శేఖర్, కాటం ప్రవీణ్, రాసాల శ్రీను, పాండరయ్య, శ్రీ కాంత్, రాజురెడ్డి, అనిల్ పాల్గొన్నారు

కవి సమ్మేళనానికి సుధీర్‌బాబు కవిత ఎంపిక


సుధీర్‌బాబు

చండూరు, ఏప్రిల్ 19: చండూరు సాహితీ మేఖల సభ్యుడు, తెలుగు భాషోపాధ్యాయుడు మద్దోజు సుధీర్‌బాబు రాష్ట్రస్థాయి కవి సమ్మేళనానికి ఎంపికయ్యారు. తెలంగాణ కవుల సంఘం, కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి కవి సమ్మేళనానికి సుధీర్‌బాబు రచించిన 'ధర్మగంట' అనే కవిత ఎంపికైంది. కవిత చదివి వినిపించడానికి సంస్థల నిర్వాహకులు సుతారపు వెంకటరమణ, అనుముల ప్రభాకరాచారి నుంచి ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రముఖ సాహితీవేత్తలు కొకలూరి ఇనాక్, సుధామ, విహారి, గిరిజా మనోహర్‌బాబు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబును పలువురు ప్రముఖులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం...

హాలియా: హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కరెంటు లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో హాలియా టౌన్-1 ఫీడర్‌కు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు హాలియా విద్యుత్ ఏఈ బాలు తెలిపారు. హాలియా మునిసిపాలిటీలోని అంగడిబజార్, రెడ్డి కాలనీ, సాయిప్రతాప్‌నగర్, వీరయ్యనగర్, మిర్యాలగూడ, దేవరకొండ రోడ్లు, 11 కేవీ కొత్తపల్లి ఫీడర్ కింద ఉన్న కొత్తపల్లి గ్రామానికి, రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కుపాస్‌పల్లి ఫీడర్ కింద ఉన్న కుపాస్‌పల్లి గ్రామాలకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ గృహ, వాణిజ్య, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నల్లగొండ: బీజేపీ, ఎంపీ అభ్యర్థులు శానంపూడి సైదిరెడ్డి, బూర నర్సయ్యగౌడ్ ఈ నెల 22వ తేదీన నామినేషన్ వేస్తున్న సందర్భంగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ హాజరు కానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

శాలిగౌరారం: బీజేపీ మళ్లీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు అన్నారు. మండంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన 30 మంది, వంగమర్తిలో 10 మందితో మరో 50 మంది వివిధ గ్రామాలకు చెందిన వారు బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్ల చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాపు రవి, పార్టీ మండల అధ్యక్షుడు దమ్ము రమేష్, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా, నాయకులు అల్లె రాములు, సుంకరి అంతయ్య, రాచమల్ల శ్రీను, యాదగిరి, అన్నపూర్ణ, శ్యాంసుందర్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

మునుగోడు: లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ హ్యాట్రిక్ విజయాన్ని పక్కాగా సాధిస్తారని, భువనగిరి గడ్డపై కాషాయజెండా ఎగురవేయటం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు వేదాంతం గోపీనాథ్ ధీమా వ్యక్తం చేశారు. మునుగోడులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలు తమ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. భువనగిరి ఎంపీగా నిలబడిన బూర నర్సయ్యగౌడ్, నిస్వార్థంతో పనిచేసే మచ్చలేని నాయకుడని గుర్తు చేశారు. ఆయన్ను ఎంపీగా గెలిపించాలని కోరారు.

కట్టంగూరు: మండలంలోని కురమర్తి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ విద్యార్థులకు గ్రామశివారులో ఉన్న సోలార్ కంపెనీ ఆధ్వర్యంలో బ్యాగులు, పాఠశాలకు టేబుల్స్, ఎల్ఈడీ టీవీ, ప్యూరిఫైడ్ వాటర్ మెషిన్, ఆట వస్తువులు, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో సోలార్ కంపెనీ జనరల్ మేనేజర్ ప్రదీప్, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, ఇంద్రకంటి విష్ణు, శ్రీకాంత్, హెచ్ఎం రమణారావు, అంగన్‌వాడీ టీచర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండటౌన్: మండువేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకురావడం అభినందనీయమని మదీనీ మజీద్ కాంప్లెక్స్ టెనెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ లతీఫ్ అన్నారు. మదీనీ మజీద్ కాంప్లెక్స్ టెనెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మసీద్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఫరీదుద్దీన్, ఫహీముద్దీన్, రఫీక్, రియాజ్ ఖాన్, సల్మాన్, ఇమ్రాన్, రహీం, శివ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రెడ్డిమల్ల భిక్షం బీఆర్ఎస్ పార్టీని వీడి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సమక్షంలో శుక్రవారం సీపీఎంలో చేరారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ భువనగిరిలో నామినేషన్ వేస్తున్న సందర్భంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రంలోనైనా, దేశంలోనైనా పేదాల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సీపీఎం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, పెంజర్ల సైదులు, చిలుముల హేమంతయ్య, రామస్వామి, గడగోజు రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక పార్టీ సీట్లు గెలుస్తుందని రాష్ట్ర ఆదివాసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. నరంపేటతండాలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గిరిజనులు అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో రవినాయక్, రాజునాయక్, రవీందర్‌నాయక్, రమేష్ నాయక్, మహేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ మండలం కొండబీమనపల్లి గ్రామానికి చెందిన 60మంది లబ్ధిదారులకు పెంచికల్‌పహాడ్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎంపిక చేశారు. దేవరకొండ పట్టణానికి చెందిన 525 మందికి పట్టాలు అందజేశారు. కొండబీమనపల్లి లబ్ధిదారులను 60 మందిని ఎంపిక చేసినా వారికి ఇవ్వలేదు. వెంటనే వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బాధితులతో పాటు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు డిమాండ్ చేశారు.

గుర్రంపోడులో ఈదురుగాలులతో వర్షం

● పిడుగుపడి తాటిచెట్టు దగ్ధం

గుర్రంపోడు, ఏప్రిల్ 19: గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఈదురుగాలులతో వర్షం కురియడంతో అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. బ్రాహ్మణగూడెంలో తాటిచెట్టుపై పిడుగుపడటంతో తాటిచెట్టు దగ్ధమైంది. రాత్రి సమయంలో పిడుగుపడటంతో ఎవరికి ఎలాంటి హాని జరగలేదు. వర్షం ధాటికి ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యాయి. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒక వైపు మండుటెండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.